# నిజాయితీ ఖరీదు

కె.బి.యస్. కుమార్



ఛటుక్కున మెలకువొచ్చింది నాకు.

కడుపు ఉబ్బిపోయింది. బాత్రూముకి పోవాలి.

కంపార్టుమెంటంతా నిద్రపోతోంది. క్రిందకి చూశాను. మిడిల్ బెర్తులో రజని, పిల్లలు నిద్రపోతున్నారు. గుడ్డిగా వెలుగుతోన్న మూడు బల్బులూ మసక వెలుగుని మాత్రమే ప్రసాదిస్తున్నాయి.

టైమ్ చూసుకున్నాను. రెండు.

ప్రకృతి చీకటి చీరలో భయంకరంగా కనిపిస్తోంది. విదియ చంద్రుని గుడ్డి వెన్నెట్లో వేగంగా వెనక్కి వెళ్ళిపోతోన్న చెట్లూ, చేమలూ అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

నెమ్మదిగా దిగాను. సిగరెట్ వెలిగించుకున్నాను. ఖాళీ అగ్గిపెట్టెని కిటికీలోంచి గిరాటేశాను.

మాది రిజర్వేషన్ కంపార్టుమెంటు. పరిగెడుతోన్న రైలు చప్పుడు, తిరుగుతోన్న ఫ్యాన్ల చప్పుడు, ఒకరిద్దరి గురక

కిటికీలోంచి చల్లగాలి రివ్వున లోపలికి వీస్తోంది. ఏడేళ్ళ పుత్రరత్నం ముడుచుకుని పడుకుంటున్నాడు.

కిటికీ వద్దకి వొంగి గ్లాస్ షట్టర్ దించాను. లావెట్రీ వేపుకి అడుగులు వేశాను. అక్కడ గుమ్మంవద్ద ముడుచుక్కూచున్న ఆకారాన్ని చూసి దిమ్మెరపోయాను.

వయసు దాదాపు ఇరవై వుండొచ్చు. శుభ్రమైన నైలెక్స్ చీర. తెల్లరంగు బ్లౌజు. చేతులకి రెండేసి మట్టి గాజులు.

మోకాళ్ళపై చేతులాన్చుకుని ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్న ఆ అమ్మాయి నన్ను చూసి ఉలిక్కిపడి ప్రక్కకి తప్పుకుంది.

లోపలికి వెళ్ళి లఘుశంక తీర్చుకుని బైటికొస్తూ ఓరగా ఆమెకేసి చూశాను.

స్థానం మారింది. భంగిమ అదే!

నాలోఅనుమానాలు పేరుకుపోసాగాయి. ఎవరామె? రిజర్వేషన్ కంపార్టుమెంటులో ఎందుకెక్కింది? రెండైనా నిద్రపోకుండా ఎందుకు మేల్కొని వుంది? బాధగా, భారంగా కనిపిస్తూ దేన్ని గురించి ఆలోచిస్తోంది. ఎవర్నో ప్రేమించి పెద్దల అంగీకారం కుదరక అతని వద్దకి వెళ్ళిపోతోందా? జీవితమ్మీద

మీద విరక్తితో ఏదైనా బ్రిడ్జిలాంటిదొస్తే దూకి ఆత్మహత్య చేసుకోబోతోందా? లేక...

ప్రయాణీకురాల్లా నటిస్తూ అదనుచూసి హస్త లాఘవం చూపడం కోసం ఎదురుచూస్తూ అందుకోసం ప్లాన్ వేస్తోందా?

బాధ్యతగల పౌరుడిగా ప్రస్తుత నా కర్తవ్యం? ఆమెనేమని పలకరించాలి? ఆంతర్యం ఎలా గ్రహించాలి?

"ఎక్కడికి వెళ్ళాలి?" నెమ్మదిగా అడిగాడు, మాటతీరుని బట్టి సంస్కారాన్ని అంచనా వెయ్యవచ్చునన్న ధీమాతో.

"ధారానగర్" క్లుప్తంగా చెప్పిందామె.

"ఎక్కడనుండి వస్తున్నారు?"

"సత్తుపల్లి...."

"సత్తుపల్లా మీది....?"

"ధారానగర్.."

"యిందులో ఎక్కారేం..?"

"యిది నా దైనందిన కార్యక్రమం" అందామె.

ఆశ్చర్యపోయాను.

ఆమె యింకా చెపుతోంది.

"నా పేరు నిర్మల. ఎనిమిది వరకూ చదివాను. మా నాన్న కూలిపని చేస్తూ కాలు విరగ్గొట్టుకున్నాడు. పైగా వాడు తాగుబోతు. అమ్మకు పక్షవాతం. వాళ్ళకి నేను తప్ప సంతానం లేదు. సంపాదనాభారం నామీద పడింది. కూలిపని చేస్తే సంపాదన తక్కువొస్తుందని మానాన్న నన్నిందులోకి దింపాడు. రిజర్వేషన్ పెట్టెల్లో నేను ఆరోగ్యంగా ఉన్న మగాళ్ళను ఆకట్టుకోవాలి... " అని ఒక్కసారి నాకేసి దీనంగా చూసి తలదించుకుందామె.

బాధతో నా హృదయం నిట్టూర్చింది. లోకంలో యిలాంటి తండ్రులుంటారా? లక్ష్మీదేవికి మల్లే చూసుకొని పెళ్ళిచేసి పంపాల్సిన కూతుర్ని స్వయంగా నరక కూపంలోకి తోసే యిలాంటి ధూర్తుల్ని దేంతో కొట్టాలి?

అమాయకమైన వదనంలో ఎంత దైన్యం?! ఆడపిల్లగా పుట్టిన నేరానికి ఆమె తనువు పరిచి సంపాదించాలా?

సమాజం ఎటుపోతోంది. ఆడజాతికెంతటి దుర్గతి పడుతోంది? మానవత్వం ఏమైపోతోంది. కందుకూరిలాంటి మహనీయులే బ్రతికి ఉంటే ఏమయ్యేవారు?

వెక్కి వెక్కి ఏడుస్తోన్న ఆమెని చూసి ఉలిక్కి పడ్డాను. కారణం అడిగాను.

''యివాళ పదిగంటలనుండి యింతవరకూ ఒక్కరుకూడా పరిచయం కాలేదు. అరగంటలో ధారానగరం రాబోతోంది. పాతిక్కి తక్కువ తీసుకు రాకపోతే మానాన్న చీరేస్తాడు.''

ఆమె ఏడుపులో నిజాయితీని చూసి నా మనస్సు తరుక్కుపోయింది. అప్రయత్నంగా జేబులో చెయ్యి పెట్టాను.

నాఆంతర్యం గ్రహించిందామె. ''క్షమించండి. నేను బిచ్చం తీసుకోను...'' అంది మెల్లిగా.

నాకళ్ళమ్మట నీళ్ళొచ్చాయి.'నిజాయితీ! నీకింత దుర్గతి పట్టిందా?' అంటూ వాపోయింది నా హృదయం.

ఆమె కోసం నేను తప్పు చెయ్యదల్చుకున్నాను. కామంతోకాదు. సేవా కాంక్షతో. ఓ నిర్భాగ్యని కనీసం ఒక్కరోజైనా కసాయిగుండె ఉక్కుపిడికిలి దెబ్బకి దూరం చెయ్యటం నా అభిమతం.

లైటులేని, కలుషిత వాతావరణమైన ఆ యిరుకు క్రెటిన్‌లో ఎవరైనా వస్తారనే భయంతో మనసు ఏకాగ్రత కోల్పోయింది.

అయిదునిమిషాల్లో బయటికొచ్చేశాము.చీకట్లోనే నా జేబులో ఉన్న యాభై రూపాయల్ని ఆమె జాకెట్లో దోపాను, బయటికొచ్చాక యిస్తే పాతిక్కి మించి తీసుకోనంటుదన్న సంశయంతో.

కృతజ్ఞతతో ఆమె కళ్ళు మెరిశాయి. చేతులు జోడించి నమస్కరించింది.

ధారానగర్ స్టేషన్లో దిగిపోయింది.

నాకు చాలా తృప్తిగా ఉంది. కోరిక తీరినందుకాదు. అది అనిర్వచనీయం.

బ్యాగ్‌లోంచి కొత్త సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె తీసుకొని తెల్లవార్లూ సిగరెట్స్ తాగుతూ వుండిపోయాను.

తెల్లారాక జేబులో దేనికో చూసుకున్న నాకు యాభైరూపాయలనోటు వెక్కిరిస్తూ కన్పించింది.

అదిరిపడ్డాను. అంటే... అంటే... ఆ చీకట్లో ఆమెకి 'పారితోషకం'గా యాభై నోటనుకుని, ఢిల్లీలో మేం కలవాల్సిన మా స్నేహితుని ఇంటి అడ్రస్సున్న కాగితం యిచ్చానన్నమాట!

మైగాడ్...

వాతలతో హూనమైన నిర్మల శరీరం నా కళ్ళకి స్పష్టంగా కనిపిస్తోంది *

## స్త్రీకాలం

# కన్నతల్లిని గౌరవించటం నేర్చుకోండి

''నేను ఈమధ్య మా బంధువులింట్లో, పెళ్ళికి వెళ్ళాను. అక్కడ అంతా 18, 19 ఏండ్ల అమ్మాయిలు, కాలేజి గర్ల్స్, వాళ్ళ వేషధారణ, మాటలు, అతిశయోక్తులు, గట్టిగా పగలబడి నవ్వటం, ఈ లక్షణాలన్నీ ఒక ఎత్తు. కన్నతల్లిని హేళన చేయటం, ఆమెకు ఏమీరాదని, ఎగతాళి చేయటం చూచి ఈ వ్యాసము రాయాలనే సంకల్పము కలిగింది. ఒకమ్మాయి రెండు జడలతో ఎంతో అత్యాధునికంగా అలంకరించుకొని, స్టైయిల్‌గా ఉంది. తన ఫ్రెండ్స్‌తో అంటూంది. ''మా అమ్మకు ఏమీ తెలియదు. వట్టి పల్లెటూరి మొద్దు. పిచ్చి, వాదస్తము. అందుకే నేను ఏమీ చెప్పను, అడగను. అన్నీ మా ఫాదరే చూస్తారు. నాకు కావల్సినవన్నీ కొనిస్తారు''.

నాకు పట్టరాని కోపం వచ్చింది. నా కూతురే అయితే లాగి రెండు చెంపలూ ఎడా పెడా వాయిస్తామా? అన్నంతగా ఆవేశము వచ్చింది.


ఒక్క ఆ అమ్మాయే కాదు. నేను చాలా కుటుంబాలలో గమనించాను. తల్లికి, చదువురాదని, సోషల్‌గా మూవ్ కాలేదని అందంగా అలంకరించుకోదని, ఫ్రెండ్స్‌కు పరిచయము చేయడం నామోషిగా భావించే ఎంతోమంది టీనేజ్ గర్ల్స్ అమ్మను సరిగ్గా గౌరవించరు. కేవలం తమకు కాలేజి టైముకు వండి పెట్టే వంట మనిషిగానో, పనులు చేసి పెట్టే పనిమనిషిగానో చూస్తారు. కాని అమ్మ విలువ గుర్తించటం లేదని నేను నిశ్చయంగా చెప్పగలను.

అంటే ఎవరు? నవమాసాలు మోసి, కని పెంచి పెద్దచేసి, ఆలనా పాలనా, ముద్దు ముచ్చట్లు చూచినంతగా వేరే ఎవరు చూస్తారు? పసితనంలో వచ్చీరాని అల్లిబిల్లి మాటలకు మురిసిపోయినా తల్లిని, పెద్దయ్యాక, చదువులు చదువులు డిగ్రీలు వెలగబెట్టి సంస్కారము అలవరచుకోవలసిందిపోయి, అపహేళనగా, ఎత్తిపొడుపులతో సత్కరిస్తారు పిల్లలు. ఆ మాతృహృదయం ఎంతగా గాయపడుతుందో ఒక్కసారి ఆలోచిస్తే వారుఆ పని చేయరనుకుంటాను.

రేపువాళ్ళకు పెళ్ళవుతుంది, కాలానుగుణ్యంగా మార్పులు వస్తాయి. ఈ రోజు ఫ్యాషన్ అనుకున్నవే, ఇక ఇరవై ఏండ్లకు ముసలమ్మల్లా కనిపిస్తాయి. అప్పుడు వాళ్ళ పిల్లలు మరల తమలాగానే తయారై, తమను మూలకన చేస్తే ఎలా ఉంటుంది? అని ఆత్మ విమర్శ చేసుకుంటే? అమ్మను గౌరవించగలుగుతారు. కేవలం పుస్తకాలు బట్టీబట్టి డిగ్రీలు చదవడమే కాదు సినిమాలు, స్నేహితులతో షికార్లు కొట్టడం సంస్కారమనిపించుకోదు. కన్నతల్లిని గౌరవించి, ఆమె మనస్సుకు సంతోషం కలిగించినప్పుడే ఆ డిగ్రీలకు సార్థకత.

అమ్మ వంటింటికే పరిమితం అన్న ధోరణి లేకుండా గుడికి, బజారుకు, సినిమాకు, పేరంటానికి తమతోపాటుగా, తీసికెళ్ళటం, తమ ఫ్రెండ్స్‌కు 'మా అమ్మ' అని గర్వంగా పరిచయం చేయగల్గినప్పుడే ఆ తల్లికి పిల్లలను కన్నందుకు సంతోషము కల్గుతుంది. పిల్లలు పెద్దయి ప్రయోజకులైతే అందరికన్నా ముందుగా సంతోషించేది, గర్వపడేది ఆ తల్లే కదా!

శ్రీమతి ఎ.లక్ష్మీ మోహన్
అనంతపురము



సరికొత్త ఫీచర్!

# మా వూరంటే నాకిష్టం

మీ వూరంటే మీకెంతో ఇష్టం. మీ వూళ్ళో వున్న ప్రత్యేకతలని వివరిస్తూ, కొత్తవారికి మీ ఊరు చూడాలనిపిస్తే ఎలా రావాలో, అక్కడ ఏమేం చూడాలో తెలియజేస్తూ అరఠావు పేజీని మించకుండా అర్థమయ్యేలా రాసి పంపండి. మీ ఫోటో పంపించటం మాత్రం మర్చిపోకండి. అలాగే కవరు మీద 'మావూరంటే నాకిష్టం' అని కూడా!